ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 27, మార్చి 1996

# సుఖాంతం

**అమ్మ నన్ను అర్జంటుగా రమ్మనమని ఉత్తరం రాస్తే నేను మా ఊరు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి అమ్మ వంటింట్లో వంట చేస్తోంది. స్టౌ మీద అన్నం, కూరలు ఉడుకుతున్నాయి. ఓ కమ్మని వాసన. ఇంట్లో అన్నయ్య కనబడలేదు.**

నేను అమ్మ ఏమరిపాటుగా ఉన్నప్పుడు వెనకే వెళ్ళి ఆమె వీపు మీదకు ఉరికేవాణ్ణి. అలానే నాన్న నా వెనక నుంచి వచ్చి నన్ను లేపి పైకెత్తేవాడు. అవును. నాన్న పోయి పదేళ్లు అయింది. అమ్మ మా పక్షిగూడు లాంటి ఇంటిలో మమ్మల్నిద్దర్నీ తన ఒడిలో తీసుకుని భర్త పోయిన లోటును కప్పి పెట్టుకుంది. ఆమె ఎప్పుడూ తన బాధ, తనను దాటి వీధి గుమ్మం వరకూ వెళ్ళడానికి కూడా అవకాశం ఇచ్చేది కాదు. ఉన్న ఎకరంన్నర భూమిని కౌలుకు ఇచ్చి ఇంటిని గుంభనంగా నడిపింది. అన్నయ్య పెళ్ళి అయి అయిదేళ్ళు అయింది. వాడికి పిల్లలులేరు. మా అందరికీ అదో దిగులు. ఆ మాట ఎవరైనా అంటే అమ్మ నవ్వేసి "కడుపు పండడానికి పైవాడి కరుణకూడా ఉండాలి" అనేసేది. ఇంట్లోకి వెళ్ళగానే మా ఇంట్లోని గతం, అనుభవాలు, నా మీదకు ఉరుకుతూంటే కాస్త నిలదొక్కుకుని "అమ్మా" అని పిల్చాను. చారులో పోపు పెడుతూన్న అమ్మ గిచుక్కున వెనక్కి తిరగడం, ఆ తిరగడంలో చేతిలోని గరిటలో నేగిన ఎర్ర మిరపకాయలు మంటలోపడి గొట్రు రావడం, అమ్మ "నువ్వురా... రా" అంటూ రెండడుగులు ముందుకు వేసింది. నన్ను చూసి, అమ్మ సంతోషపడి, ఆ తర్వాత "ప్రయాణం బాగా జరిగిందా" అంటూ ఆ సంతోషంతో శరీరం ఊగిసలాడుతూంటే లోపలి పరుగులాటకు పగ్గాలు వేసుకుంటోంది.

'ఇంట్లో ఎవరూ లేరా అమ్మా... అన్నయ్య, వదినా?"

'మీ వదిన వాళ్ళు పుట్టింటికి వెళ్ళింది. ఆ పద, వసారాలో కూర్చుందువుగానీ, నేను కాఫీ కలిపి తెస్తాను.'

నేనూ వసారాలోకి వెళ్ళి మా చిన్న దొడ్డినీ అందులో మొక్కల్నీ పాదుల్నీ చూస్తూ - చుట్టాల గురించి అమ్మను అడగడం, అమ్మ పేరు పేరునా వాళ్ళ యోగక్షేమాలు చెప్పడం జరుగుతోంది. అయిదు నిముషాల్లో అమ్మ కాఫీ గ్లాసు నాకందించింది. ఆ పైన అక్కడే

ఉన్న మా పాత కుర్చీలో కూర్చుని పమిట కొంగుతో నుదురు తుడుచుకుంది.

అలా ఉన్నావేమిటమ్మా నీర్సంగా?"

"నేను బాగానే ఉన్నానురా. నువ్వేమిటీ మరీ రివటలా తయారయ్యావ్. వేళకు తినడం లేదా?"

"తింటున్నాను. హోటల్ భోజనంగా, ఇలాగే ఉంటుంది. అది సరే వేణు అన్నయ్య ఆఫీసు నుంచి రాలేదా?"

అమ్మ తలవంచుకుంది. క్షణం ఆగింది. "వాడు వారం క్రితం కాశీ వెళ్ళాడు. అక్కడి నుంచి హరిద్వార్, ఋషికేశ్ చూసి వస్తానన్నాడు."

"అదేమిటమ్మా... ఇంట్లో నువ్వొక్కత్తివీ ఉంటున్నావా? కాశీ నువ్వు కూడా వెళ్ళవల్సింది. ముందు ముందు మరీ కష్టం."

'వాడు ఎవరో స్వాముల వారితో కలిసి వెళ్ళాడురా'

"బాగానే ఉంది" అని అన్న తర్వాత నాకు అమ్మ రాసిన ఉత్తరంలో సంగతులు గుర్తొచ్చాయి. అదే అడిగా. ఆమె వెంటనే మాట్లాడలేదు.

"అదేమిటమ్మా విషయం చెప్పు. నువ్వు మామూలు విషయమయితే ఉత్తరం రాయవు. ఏదో బాధపడే సంఘటనలే ఇక్కడ జరుగుతున్నాయనిపిస్తోంది. బాధ నాతో పంచుకోవడానికీ నీకేం అభ్యంతరం అమ్మా."

"అన్నయ్య వరసేం బాగోలేదురా. ఏడాదిగా వాడిలో మార్పు వచ్చింది. వదిన సంగతి నీకు తెల్సిందే. ఆమెతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్నాడు" అమ్మ కాస్సేపు ఆగి అంది. "వాడిలో ఏదో నిర్లిప్తత బయలుదేరిందిరా. అది వాడినీ విధంగా దారి మళ్ళిస్తుందనుకోలేదు" అంటూ అమ్మ ఏవేవో చెప్పింది. ఆ చెప్పడంలో ఆమె గొంతు జీరపోయింది. దుఃఖాన్ని కన్నీటినీ అతి ప్రయత్నం మీద నొక్కి పెడుతోందని తెలిసి పోయింది.

అమ్మ చెప్పిన విషయాలు విని నేను ఆశ్చర్యపోయాను. అన్నయ్య వేణు ఊళ్ళోనే ఉండే అవధానిగారి శిష్యరికం మొదలుపెట్టాట్ట. ఆంజనేయ ఉపాసన, దేవీ ఉపాసనా అంటూ పూజలు చేస్తూ, ఉపవాసాలు ఉంటూ వేరు సంగతులేం పట్టించుకోవడం లేదుట. వేదాంతం పుస్తకాలు చదువుతూ విచ్చలవిడిగా దానాలు ధర్మాలు చేస్తూ గిరజాలుపెంచుకుని దేవుడు పూనిన వాడిలా ఏవేవో చేష్టలు చేస్తాట్ట. అవధానిగారి శిష్యరికంలో తను కుండలిని విద్య నేర్చుకుని హిమాలయాలు పట్టిపోతానని చెప్తాట్ట. ఊళ్ళోకి చుట్టు పక్కలకు వచ్చిన సాధువుల్ని వెంటేసుకని తిరుగుతాట్ట.

"ఏం చెప్పమంటావురా. అమ్మాయిని అడిగితే 'ఆయనకు తెలియాలి గదా మనం చెప్తే వింటారా అత్తా' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది."

నాకేమనాలో తోచలేదు. అమ్మ వైపు చూస్తూ ఉండిపోయాను. ఆవిడ నా కళ్ళలోకి

చూస్తూ అంది, 'నువ్వు ఉండేది పాండిచ్చేరిలో. అక్కడా అరబిందో ఆశ్రమం ఉందిగా. నువ్వు కూడా అందులో జేరావంటే ఇక చెప్పవల్సిందేం లేదు. నా దారి నేను చూసుకుంటాను. నీకు పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. నన్ను ఏం సమాధానం చెప్పమంటావు?"

"ఇదేం భయమమ్మా. నేను అన్నయ్యలా చేయనులే!"

"పిల్లలకు తల్లిదండ్రుల మీద భక్తి లేనప్పుడు పెద్దవాళ్ళకు మిగిలేది భయమేరా మరి."

నేను ఆలోచించి అన్నాను. "అమ్మా, ముందు అన్నయ్య విషయం ఆలోచించాలి. వాడిని ఈ అవధాని గారినుంచి దూరం చెయ్యాలి. ముప్ఫై ఏళ్ళున్న యువకుణ్ణి అందునా సంసారిని ఇలా ముక్తి, సన్యాసం అంటూ పురి ఎక్కించడం అన్యాయం. యోగంలో లోతులు చూసిన వాళ్ళు కూడా పూజలు గట్రా మూర్ఖంగా చేయరు తెలుసా?"

"అవును, ఆ అవధాన్లు గారికి మగపిల్లలు లేరు. అందుకే ఆయన, వీడిని తన వైపు తిప్పుకున్నాడు. వీడో పిచ్చి సన్యాసి కాబట్టి యంత్రాలు తంత్రాలు అంటూ వెర్రెక్కి పోతున్నాడు."

అలా మేం మాట్లాడుకుంటూండగానే వీధి గుమ్మం దగ్గర నుంచి "అమ్మా, రుక్మిణమ్మా!" అనే పిలుపు వినబడంది. అమ్మా నేను బయటకు వచ్చాం. అవధాన్లుగారు. ఆయన నన్ను చూసి "చిన్నబ్బాయి కదమ్మా" అని ఎలా ఉన్నావోయ్ అంటూ పలకరించారు. నేను నమస్కారాలు చెప్పాను.

"లోపలికి రండి అవధానిగారూ!"

అవధానిగారు లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఆయన్ని పరిశీలనగా చూశాను. కావిరంగు పంచె, అది పెద్ద బొజ్జ మీద ఇమడలేక బొడ్డుదాటి స్థిరనివాసం ఏర్పరచుకుంది. పైన చొక్కా గానీ, భుజం మీద అంగవస్త్రం గానీ లేవు. కాళ్ళకుచెప్పులు లేవు. మెడలో అయిదారు రకాల రుద్రాక్షమాలలు రెండు చేతులకు వెండి బంగారపు ఉంగరాలు, నుదుట నయాపైస అంత కుంకుమ బొట్టు. ఆయన్ను చూస్తే మారువేషంలో పర్ణశాలకు వెళ్ళిన రావణాసురుడు గుర్తొచ్చాడు. సాధువులు, సన్యాసులు అతి నికృష్టంగా అందవికారంగా కనపడాలనే నియమం ఎక్కడ ఉందో నాకు ఎంత ఆలోచించినా అంతుబట్టలేదు. ప్రతి మనిషి తను ఎక్కడికి వెళ్ళినా కూడా ఒక విధమైన వాతావరణాన్ని మోసుకువెడుతూ ఉంటాడని దాన్నే వాతావరణ చైతన్యం అంటారనీ శ్రీ అరబిందులు అనేవారుట. అది నిజమే అనిపించింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు వినయ్‌బాబూ" అన్నారు, అవధాని ఆపైన అమ్మతో.

"మరి నేను వెడతానమ్మా. నేను గంట అయ్యింది. ఊరు నుంచి వచ్చి. మన వేణు ఎల్లుండి ఉదయానికి వస్తాడు. అతన్ని ప్రయాగలో ఆపాను, నేనే...."

"ఏమిటోనండి వాడి వరుస."

"ఏం లేదు. భయపడకు రుక్మిణమ్మా. మీ వాడు అవతార పురుషుడు. ఆ మళ్ళీ మాటల్లో పడి మర్చిపోతాను. అతని పూజ గదిలో నిత్యం దీపం వెలిగించడం మానకండి నే వస్తానమ్మా" అంటూ మెట్లు దిగాడు.

నేను ఆయనతో పాటు కొంచెం దూరం వెళ్ళాను. ఆయన "నువ్వెళ్ళరా, నేను ఇంటికి పోతానులే." అన్నాడు చనువుగా.

"మీతో మాట్లాడాలి సార్."

"అలానా?" అని అవధానిగారు మాట ఆపి, నా వైపు చూశారు.

'నేను ఎం.ఏ. పిలాసఫీ చదివాను. కానీ వేదాంతంలో నాకు తెలిసింది చాలా తక్కువ. నా సంశయాలు ఎవరూ తీర్చలేకపోయారు. మీరయితే..."

"అలానా, నీకు దైవం మీద నమ్మకం ఉందా?"

"ఉంది"

"భేష్... రేపు సాయంకాలం మా ఇంటికిరా. డాబా మీద కూర్చుందాం. మేం ఉన్నది ఎందుకు. నీకు సహాయపడ్డానికే."

నేను ఆయనకు తుది వందనాలు చెప్పి వెనక్కి తిరిగాను.

❖ ❖ ❖

నేను వెళ్ళేసరికి అవధాన్లుగారు మేడ మీద తను భక్తులకు వేదాంత విషయాలు చెప్తున్నారు. అది పెద్ద సైజు గది. గోడలకు దేవతామూర్తుల ఫోటోలు. హాల్లో బరకం మీద ఓ ఇరవై మంది పెద్దలుకూర్చుని ఉన్నారు. అవధాన్లుగారు జింక చర్మం మీద కూర్చున్నారు. భక్తుల్లో చాలామంది మా ఊరివారే. నేనూ ఓ పక్కగా కూర్చున్నాను నిశ్శబ్దంగా.

"ఏముందండీ.... ఈ శరీరం ఓ పెద్ద మురికి కూపం. ఈ శరీరాన్ని మనం విశ్వసించ కూడదు. ఇది వికారాలు దాచుకున్న అగ్నిపర్వతంలాంటిది. ఎప్పుడు విజృంభిస్తుందో తెలియదు. ఇంకా భగవంతుడికీ మనకు మధ్య నిత్యం తంపి పెడుతూనే ఉంటుంది."

భక్తుల్లోంచి ఒకాయన అన్నాడు. "అత్తగారి తంతేమో! వాళ్ళు పైకి కనబడకుండా కొడుకులకూ కోడళ్ళకూ మధ్య విభేదాలు సృష్టిస్తారు చూడండి."

జనం నవ్వారు. అవధాన్లు చిరునవ్వు నవ్వి, "ఈ శరీరం పెట్టే పీడ నుంచి విముక్తులమవడానికే నిత్యం మనం ప్రయత్నిస్తూ ఉండాలి. అసలు, భగవంతుడే శరీరం అనే ఈ బంగారు పంజరం సృష్టించి లీలలు నడిపిస్తూ ఉంటాడు. మనకు ఈ శరీరాన్ని అందంగా ఉంచుకోవాలని మమకారం. ఆ మమకారం అంతటితో ఆగదు. అందంగా కన్పించే ఎదుటి మనిషి మీద ఆకర్షణ కలుగుతుంది. ఇది ఆ తర్వాత మన పతనానికి నాందీ వాచకం పలుకుతుంది. భగవంతుణ్ణి నమ్మినవాడికి షోకులేమిటండీ?" అంటూ ఏవేవో చెప్పి, భక్తుల్లో ఒకాయన వైపు చూసి "ఏమంటారు గిరిగారూ?" అన్నాడు.

గిరిగారు సైన్స్ బాగా చదివిన వ్యక్తి. పైగా కమ్యూనిజం ఒక్కటే నిజమని ఆనాటి నుంచి వాదిస్తూండే పార్టీ లాయలిస్ట్. ఆయన అవకాశం జారవిడవకూడదన్నట్టు అన్నాడు. "ఆధునిక విజ్ఞానం అదే సైన్స్ శరీరమనేది ఒక పదార్థం మాత్రమేనని చెప్తుంది. ప్రకృతి, తన పరిణామ దశలో సృష్టిలో అన్ని వస్తువులతో పాటు మనిషినీ ప్రసాదించింది. ప్రాణం, మేధలాంటివి పుట్టుకతో వచ్చి మరణంతో అదృశ్యమవుఅయి. అంతేగానీ, ఆత్మ చేతనశక్తి, పునర్జన్మ లాంటి మాటలకు ప్రాధాన్యం ఇవ్వదు.

అవధాన్లు గారినీ, గిరిగారి మాటలు నన్ను ఆశ్చర్యంలో ముంచాయి. కాస్త ఆవేశం లాంటిదీ వచ్చింది. అందుకే "ఏమీ అనుకోనంటే నన్నో మాట చెప్పనిస్తారా గిరిగారూ?" అన్నాను.

'చెప్పు. నువ్వు ఏం.ఎ. ఫిలాసఫీ చేశావని విన్నానులే.'

నేను కాసేపు మాట్లాడలేదు. హాలు నలువైపులా చూశాను. ఆ పైన నెమ్మదిగా, "నేను చదివిన పుస్తకాలు నాకు నేర్పినవి మాత్రమే చెప్తున్నాను. పెద్దలు మరోలా భావించరాదు" అన్నాను.

"కానీవయ్యా..."

"ఈ శరీరం విశ్వంలోని పరిణామక్రమానికి లోబడి ఉన్నా దానికి ఎప్పుడూ ప్రతనిధిగానే ఉంటూ ఉంటుందిట. మనం ఈ వేళ పొందిన ఈ శరీర నిర్మాణంలో ఒక గొప్ప నేర్పరితనం ఉంది. శరీరం ఒట్టి పదార్థజనితమే కాదు. దానికి ఒక అంతఃకరణ ఉంది. మళ్ళీ ఈ అంతఃకరణకు మూలం ఆత్మ... అలాగే ఈ ఆత్మ పరమాత్మలో ఒక భాగం. శరీరమే పరమాత్మకు ప్రతీక అయినందువల్ల ఈ శరీరం పరమాత్మలోని ఒక భాగం అవుతోందిగానీ ఇది వేరు కాదు. భగవంతుడి ప్రేరణకు ప్రతిస్పందించడమే శరీరం యొక్క కర్తవ్యం. కొంత తెలియని తనం వల్ల, మతం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్లా శరీరాన్ని నిర్లక్ష్యం చేయడం, చేయమనడం జరిగిందని నా భావన."

అవధాన్లు గారు నా వైపు కొరకొర చూశారు. గిరిగారు తన కళ్ళు ఎర్రబర్చుకున్నారు. కానీ ఇంతలో మరొక వ్యక్తి అవధాన్లుగారిని "చిన్న సంశయం గురువుగారూ" అంటూ అడ్డుకున్నారు.

"చెప్పండి"

"కోరుకున్న ఆధ్యాత్మిక జీవితానికి నిత్యజీవితానికి ఎక్కడా పొంతన కుదరదు. అంతా చుక్కెదురే. ఎలా అంటారు?"

"చాలా వాటిని పట్టించుకోరాదు. పట్టించుకుంటేనే లంపటాలు..."

"నీదే భారం అనేసి, కిమన్నాస్తిగా ఉండాలంటారు."

"డిటేచ్‌మెంట్ అవసరం. అవసరమే కాదు. ముఖ్యం" అవధానిగారు నెమ్మదిగా చెప్పారు.

నాకు ఊరుకోబుద్ధి కాలేదు. నోరు విప్పాను. "హృదయపూర్వకంగా చేసే పని ఏది అయినా, అది మనకూ ఇతరులకు హాని కలగజేయదని, గొప్పగా, అద్భుతంగా ఏ పనైనా చేస్తే దాని మూలంగా అంతఃకరణ కూడా అంత అద్భుతంగానూ రాటుతేలుతుందని శ్రీ అరబిందోలాంటి వారు అంటున్నారు."

"వారి మార్గం, మతం వేరు. మనది అద్వైతం. పైగా విదేశీ చదువుల వల్లా విదేశీ విజ్ఞానం వల్లా మేలుకంటే కీడే ఎక్కువ."

అవధానిగారు కటువుగా అటూ ఇటూ కదిలి "ఈ రోజుకు చర్చ ముగిద్దాం. నేను బంధువుల ఇంటికి పోవాల్సి వుంది. క్షమించాలి" అంటూ లేచారు. అందరూ నమస్కారాలు చెప్పి ఒక్కొక్కరే కిందికి వెళ్ళారు. నేనూ అవధానిగారే మిగిలాం అక్కడ.

"అవధానిగారూ! పదినిముషాలు మీతో మా కుటుంబ విషయాలు మాట్లాడాలను కుంటున్నాను."

"అంత అత్యవసరమా?"

"నేను రేపు తిరిగి వెళ్ళిపోతున్నాను. అందుకని."

అవధానిగారు అయిష్టంగానే తల ఊపారు. "ఏం లేదండీ. మా అన్నయ్య వేణులో చాలా మార్పు వచ్చిందని అమ్మ బాధపడుతోంది. ఆఫీసు మానేసి ఊళ్ళమ్మటపడి తిరుగుతున్నాట్ట. ఎప్పుడు చూసినా పూజలు... జపాలు."

"అదా" అని నవ్వేసి, "చూడు వినయబాబూ! వేణుతత్వం నాకు చిన్నప్పటినుంచీ తెలుసు. అతనికి జీవితం అంటే విరక్తి కలిగింది. అది ఎందుకు ఎలా కలిగిందంటే జవాబు చెప్పలేం. అదే అతణ్ణి వేదాంత ధోరణివైపు మళ్ళించింది".

"అది సరే... అయితే వాడు తన జీవిత లక్ష్యం ఏమిటో కనీసం మీతో చెప్పి ఉంటాడని మేం అనుకుంటున్నాం. మాకు మీరు సహాయపడాలి. నిండా నలభై ఏళ్ళు లేని కొడుకు తనకు కాకుండాపోతోంటే ఏ తల్లి అయినా ..." నేను ఆగిపోయాను.

అవధాన్లుగారు నావైపు సూటిగా చూసి "నువ్వు బాగా చదివినవాడిలా తెలివైనవాడిలా కన్పిస్తున్నావ్. వేణుని నువ్వే అడగరాదా? నాదాకా రావడం దేనికి?" అన్నాడు.

"వాడు మీ శిష్యుడు. శిష్యుడి అంతరంగం గురువుగారికి తప్పక తెలిసి వుంటుందని అడిగాను. వేరే ఉద్దేశం ఏం లేదు."

"చూడు నాయనా! నా దగ్గరకు వచ్చిన వాళ్ళకు నేను నాలుగు ముక్కలు చెబుతాను. అంతవరకే నా పని" అని ఆగి "పద వెడదాం" అన్నారు.

ఇద్దరం మేడ మెట్లు దిగుతున్నాం.

❖ ❖ ❖

వేణు అన్నయ్య ఊరు నుంచి వచ్చాడు. భుజాన హరేరామ, 'హరేకృష్ణ కల్ట్' వారి సంచి. కాళ్ళకు చెప్పులు లేవు. గెడ్డం మీసాలు పెరగడంలో మనిషి కొత్తగా కనిపిస్తున్నాడు.

మనిషి బాగా సన్నబడ్డాడు. నన్ను చూసి "ఎప్పుడు వచ్చావ్" అని పలకరించి పెరట్లోకి వెళ్ళిపోయాడు. స్నానం చేసి తన పూజగదిలోకి వెళ్ళి, ఓ గంట తర్వాత బయటకు వచ్చాడు. అమ్మతో ఎక్కువ మాట్లాడలేదు. "ఇప్పుడే వస్తాను" అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

"ఇదీ వరస. మళ్ళీ ఏ సాయంకాలమో వస్తాడు ఇంటికి."

నేను మాట్లాడలేదు. ఉదయం, మధ్యాహ్నంగా, మధ్యాహ్నం సాయంత్రంగా మారింది.

"అమ్మా నేనోసారి మన పొలం వైపు వెళ్ళివస్తాను" అని చెప్పి బయటపడ్డాను. నేను పది నిముషాల్లో చేలగట్ల వెంటపడి – మా పొలానికి చేరుకున్నాను. అప్పటికే కోతలు అయిపోయాయి. పొలంలో టమేటో మొక్కలు, కాబేజీ మొక్కలు ఎదుగుతున్నాయి. మా పొలం గట్టున ఓ మూలగా పెద్ద వేప చెట్టు, మరో పెద రెండు మామిడి చెట్లు. అవి వయసు వచ్చిన పెద్ద మనుషుల్లా ఏ కదలికలు లేకుండా నిశ్చేష్టంగా కన్పించాయి. ఓ పక్కగా ఏనాడో మా నాన్నగారు వేసిన పాక, ప్రస్తుతం దాన్ని మా రైతు వాడుకుంటున్నాడు. అలా గట్టు మీద చాలా సేపు నుంచున్నాను. చెట్టు కింద నిలబడి ప్రకృతిలోకి చూస్తూంటే శరీరం కొత్త అనుభవంతో – ఆనందపడి పులకరిస్తోన్నట్టుగా ఉంది అంతా నిశ్శబ్దం. కొన్ని క్షణాలు, కొద్ది నిముషాలు నిశ్శబ్దంలో నేనుగా – నాలో నిశ్శబ్దంగా గడిచాయి.

సరిగ్గా అప్పుడే వెనక అలికిడి అయ్యింది. నాచూపు అన్నయ్య రాకను చెప్పింది.

"ఏం చేస్తున్నావురా, ఒక్కడివీ" అని అన్నయ్య పాకలోకి వెళ్ళి కుండలో నీళ్ళు గ్లాసులో పోసుకుని తాగుతూ, ఒక చేత్తో పాకలోని నులక మంచం బయటవేశాడు. దాని మీద ఇద్దరం కూర్చున్నాం. మా మధ్య మాటలు మొదలవ్వాల్సి ఉంది. అన్నయ్య నాన్న గురించి, మామయ్యల గురించి, మా ఆస్తి గురించి టూకీగా చెప్పాడు. ఆ తర్వాత నా వైపు కాస్త జరిగి – "నేను వీలయినంత త్వరగా ఈ సంసార లంపటం నుంచి బయటపడాలను కుంటున్నాను. అప్పుడు అమ్మ బాధ్యత పూర్తిగా నువ్వు తీసుకోవలసి ఉంటుంది".

"ఎక్కడికి వెళ్ళాలని నీ ఉద్దేశం."

"ఎక్కడో ఇంకా నిర్ణయం కాలేదు. ఎటో అటు..."

"మరి వదిన?"

"ఆమె ఆరోగ్యం సరిగా లేదు. నా ఆలోచనలు నన్ను సంసార సుఖానికి విముఖుణ్ణిగా చేసి చాలా కాలమయ్యింది. ఆమెకు తల్లిదండ్రులు ఉన్నారు. వాళ్ళ దగ్గర ఉంటుంది.".

నేను అన్నయ్య మొహంలోకి చూసి తలదించుకుని అన్నాను. "ఒక్క ఏడాది కాలంలో ఇంత మార్పు నీలో వచ్చినందుకు అమ్మ ఆశ్చర్యపోతోంది. భయపడుతోంది. ఏ కారణం, ఏ ప్రేరణా లేకుండా ఎవరూ సంసారాలను కాలదన్ని సన్యసించరు."

"అవన్నీ చెప్పడం నాకిష్టం లేదు".

"పలాయనవాదం ఆధ్యాత్మిక వాదానికి ఏమాత్రం దోహదపడదు. అత్యాశతో ఈ

రంగంలోకి చొచ్చుకు వెళ్ళి ఉభయత్రా భంగపడ్డవాళ్ళు చాలా మంది ఉన్నారు."

"నువ్వు చెప్తోన్నది ఏమిటో నాకు తెలుసు."

"ఈ విషయంలో మీ గురువు అవధానిగారు ఏమన్నారు?"

"ఆయన జ్ఞాని. ఆయన వాక్కుకి శక్తి ఉందిరా. ఈ ప్రాంతంలో ఆయన ఉపన్యసిస్తూంటే అడ్డుకున్నవాళ్ళను నేను చూడలా!"

"సలహా చెప్పడం గురువు బాధ్యతల్లో ఒకటి. అన్నయ్యా..."

"అలానా? నీకు గురుశిష్యుల బాంధవ్యాలు ఎలా ఉండాలో తెలుసన్నమాట" అని ఆగి, "చిన్నవాడిని అహం పనికిరాదురా" అన్నాడు కోపంగా.

"మనిషి వేదాంతమార్గంలోకి వెళ్ళడం, జీవితం మొత్తాన్ని ఆధ్యాత్మికతతో పెనవేసుకోవాలనుకోవడం మంచి గుణమే! కానీ అందుకోసం ఎవరిని గురువుగా గుర్తించామన్నదే ముఖ్యం."

"అవధానిగారు."

నేను అన్నయ్యను అడ్డుకున్నాను. "ఆయన మాట పక్కన పెట్టు. మన పూర్వీకులు గురువు యొక్క లక్షణాలు ఇలా ఉండాలి అంటూ పది వరకూ చెప్పారు. ఆ లక్షణాల్లో కనీసం ఒకటి రెండయినా అవధానిగారిలో నాకు కనబడలేదు. నిజమైన గురువు శిష్యుల్లో ఒకడిగా మారి, వారి గురించి తనే దైవాన్ని ప్రార్థిస్తాట్ట. గురువు ఉన్నతాసనం గురించి చూడడు. శిష్యుడి మీద సర్వాధికారాలు కోరడు. ఆయన, శిష్యుడికీ, భగవంతుడికీ మధ్యనున్న దూరాన్ని చెరిపి ఇద్దరినీ దగ్గర చేయాలి. ఆయనలో నాకు విజ్ఞానం కన్నా మూఢనమ్మకాలే ఎక్కువ కనిపించాయి" వేణు అన్నయ్య కోపంతో "ఆయన ఎందుకూ పనికిరాడంటావ్ కదూ!" అన్నాడు.

"నేను మాట్లాడదల్చుకున్నది నీతో. ఆయన విషయం కాదు. నువ్వు ఇంట్లో రోజు చేస్తున్న పూజలు, పునస్కారాలు, ఉపవాసాలు, కఠోర నియమాలూ, తాహతుకు మించి దానాలు... ఈ హబబ్, ఇవేవీ కూడా నీ ఆత్మవికాసానికి కించిత్ దోహదపడవు."

'ఇవన్నీ నాకు తెలుసురా. నువ్వేం చెప్పక్కరలేదు.'

"అన్నయ్యా! ముక్తి అనేది అంత తేలిగ్గా దొరికే వస్తువు కాదురా, దానికి ఎంతో పరిశ్రమ కావాలి. క్రమశిక్షణ కావాలి. మనిషి భగవంతుడి దగ్గరకు వెళ్ళే మార్గాన్ని మర్చిపోయాడని కొందరు పెద్దలు అనగా నేను విన్నాను. మనిషి భగవంతుడితో తనకు ఉండే సత్సంబంధాలు పోగొట్టుకున్నాడట. భగవంతుడిదో దారి, మనదో దారి అయ్యింది. అందుకే మనిషి తను పోగొట్టుకున్న స్థానాన్ని తిరిగి పొందాలంటే ముందు భగవంతుడితో పోయిన సంబంధం అనే 'లింక్' ఎలా దొరుకుతుందో తెల్సుకోవాలి. నా మాట విను. చిన్నవాడినని తీసిపారేయకు."

"ఆపరా నీ ఉపన్యాసం."

"నువ్వు బాగా ఆలోచించు అన్నయ్యా. వదినను గుర్తించు. సహధర్మచారిణికి ప్రేమ పాత్రుడివికా!'"

అన్నయ్య మాట్లాడలేదు.

"నేను వెడుతున్నాను అన్నయ్యా. నువ్వా ఏడాదిగా నీ శరారాన్ని ఎంత కష్టపెట్టావో, అవమానపరిచావో నీకు అర్థం కాదు. అదీ పాపమే. వస్తు రూపం, భౌతిక రూపం, ప్రాణరూపం, మేధరూపం, ఆఖరికి పరమాత్మ రూపాన్ని పొందుపర్చుకున్న అతి సుందరమైనది ఈ శరీరం. ఏ యోగం, శరీరాన్ని, మనసును, మేధను బాధపెట్టమని చెప్పదు" అంటూ లేచాను.

నాకు తెలుసు, అన్నయ్య నాతో కలిసి నడవడని.

వేణు అన్నయ్య ఆలోచించగలిగితే,

అందంగా ఆలోచించగలిగితే

ఈ చిక్కులన్నీ విడిపోతాయి.

అవును. నేను చేసింది మంచి పనే అని నాకు తెలుసు. చొరవ తీసుకని వదిన కామేశ్వరికి అన్ని విషయాలు పూసగుచ్చినట్టు రాశాను. ఆవిడ తన తండ్రితో కలిసి ఈ పాటికి ఇంటికి వచ్చే ఉండాలి. తండ్రీ, కూతుళ్ళిద్దరూ అన్నయ్యను ఓ ఆట ఈపాటికి ఆడిస్తూనే ఉండాలి. నేను లేచాను. నవ్వుకుంటూ నడక మొదలుపెట్టాను.

❖ ❖ ❖

నేను మా ఇంటిలోకి అడుగుపెట్టాను. అప్పుడు వాకిట్లో ఓ పక్కన అమ్మా, వదిని, మరో పక్కన అన్నయ్య, వాడి మామగారు చలపతిగారూ కూర్చుని ఉన్నారు. అందరి మధ్యా కేంద్ర బిందువులా నేను.

"నమస్కారం మామయ్యగారూ. చూస్తే హఠాత్తుగా వచ్చినట్టు కనిపిస్తోంది. మీరు అంతా కులాసానా?' అన్నాను.

'బాగానే ఉన్నాం. కానీ అమ్మాయికే ఒంట్లో బాగాలేదు. వారంగా అది పచ్చి మంచినీళ్ళు ముట్టడం లేదు. బహుశా భర్త మీద బెంగపడి ఉండాలి. పైగా నాలుగు రోజుల్లో నేను ఉడిపి వెళ్ళాల్సి ఉంది."

"అలాగాండి."

"ఎందుకు మామయ్యా ఆ ఊరు" అన్నయ్య ఆతృతగా అడిగాడు.

"అక్కడ పేరుమోసిన ఓ ఆశ్రమం ఉంది. నా స్నేహితులు చాలామంది అక్కడ భగవత్ చింతనలో కాలం గడిపేస్తున్నారు. నేనూ అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాను. అందుకే నీ భార్యను తీసుకు వచ్చింది."

"మంచో, చెడో నాకు తెలియదండీ చెల్లెమ్మగారూ! కానీ మీకోడలు మాత్రం, అత్తింటి గుమ్మంఎక్కననీ, ఈ ఊరు రానని ఒకటే మొరాయించింది. కారణం చెప్పమ్మా అంటే

ఇదీ అని నోరు విప్పి మాట్లాడదు. ఆ విషయం కూడా తేలుతుందని నేనూ వచ్చాను."

అమ్మా. అన్నయ్య ఏం మాట్లాడలేదు.

చలపతిగారు కాసేపు ఆగి, అల్లుడివైపు తిరిగి "నాయనా! జరిగిందేదో జరిగింది. అది అంతా మర్చిపోదాం. ఇదిగో నీ భార్య కామేశ్వరి. ఆమె బాధ్యత ఎప్పుడూ నీదే... మేం నామమాత్రం వాళ్ళమే. నన్ను దయుంచి వానప్రస్థానానికి, అదే ఉడిపి వెళ్ళడానికి నువ్వూ నీ భార్యా సహకరించండి. ఇక్కడ మీరు సుఖపడతారో లేదో అది మీ చేతుల్లో ఉంది" అన్నాడు.

ఆ పైన అందుబాటులో ఉన్న మంచినీళ్ళ గ్లాసు అందుకుని వాటిని తాగి తిరిగి మొదలుపెట్టాడు.

"ఏమిటో నాయనా! నిజనిజాలు ఎప్పుడూ దేవుడికే ఎరుక అంటారు. కానీ నీకు ఈమధ్య కాలంలో సన్యసించాలనే కోరిక ఒకటి పుట్టిందనే వార్త ఆ నోటా ఆ నోటా వచ్చి నా చెవిన పడింది. పైగా చుట్టుపక్కల అమ్మలక్కల కథనం సరే సరి. అల్లుడు, ఆ కారణాన్నే అమ్మాయిని పుట్టింటికి తోలేశాడని. నేనేది నమ్మలేదు.

వయసు మీదపడ్డవాళ్ళూ, తపనతో కాగేవాళ్ళూ సన్యసించడినికి తొందరపడ్డంలో తప్పేంలేదు. చూస్తే నలభైయ్యోపడి దాటనివాడు, పట్టుమని చుట్టూ ప్రపంచంలో పదిమందిని అర్థం చేసుకోకుండా, పసిమొగ్గ దశ దాటని జీవితానుభవంతో, దేవుడంటే రాయో, రప్పో తేల్చుకోలేని తికమకలో, ఏది ముందు, ఏది వెనకో తెలియనివాళ్ళు ఇల్లు విడిచి పారిపోతారుగానీ సన్యసించరు. సన్యసించడానికి ముందు పెద్ద ప్రిపరేషన్ మానసికంగా జరగాలి" అంటూ ఏవేవో చెప్పారు.

మళ్ళీ మంచినీళ్ళు తాగారు.

ఆ తర్వాత తిరిగి కూతుర్ని చూసి "నీకు పుట్టిల్లు లేదు. ఉన్నది అత్తిల్లు ఒక్కటే. మీరిద్దరూ పదికాలాల పాటు కలిసి ఉంటారో, అర్జంటుగా ఉన్న పళంగా విడిపోతారో మీ ఇష్టం" అనేసి మౌనంలోకి వెళ్ళిపోయారు.

కామేశ్వరి తలవంచుకుని అటూ ఇటూ కదిలింది. తన వైపు చూడని భర్త వైపు చూసింది. అమ్మ వైపు చూసింది.

"నాన్నా! నువ్వు ఉడిపి వెడతావో, ఊటీ వెడతావో అది నీ ఇష్టం. ఏడాదినాడే నా భవిష్యత్ ఎలా ఉంటుందో నాకు తెలిసిపోయింది. వారికి నేను అవసరం లేదు. అందుకే నా ఏర్పాట్లు నేను చేసుకున్నాను. నేను కేరళలో ఉన్న కీర్తిమాయిగారి ఆశ్రమానికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను" అంది. ఆపైన పమిట సర్దుకుని "ఆఖరిసారి వారినీ, అత్తగారినీ చూసిపోదామని వచ్చాను. అంతే తప్ప నాకేమీ కావాలనీ, కోరుకోవాలనీ రాలేదు" అంది. కన్నీళ్ళు కదిలితే వాటిని తుడుచుకుంది.

అమ్మ ఆశ్చర్యపోయింది. బాధగా చూసింది. అన్నయ్య తలవంచుకున్న మూలంగా ఏ

భావాలు వాడిలో రగిలాయో తెలియలేదు. చలపతిగారు మాత్రం ఖిన్నుడయి "ఏమటో అంతా మాయగా, అయోమయంగా ఉంది" అనేశారు.

నేను అనేశాను. "అమ్మా! ఎవరిదారి వాళ్ళు చూసుకుంటోన్నప్పుడు మనదారి మనం చూసుకుందాం. రేపు నాతో పాటు నువ్వు వచ్చెయ్. ఈ ఇంటికి తాళం పెట్టు. ఆ తాళం చెవి అవధాన్లు గారికి ఇవ్వు."

అమ్మ ఏడుస్తూ అన్నయ్య వైపు తిరిగి, "ఏరా" అంది.

అన్నయ్య మాట్లాడలేదు.

వంచిన తల ఎత్తాడు.

దించుకున్నాడు.

ఇంతలో గుమ్మం వరకూ వచ్చిన పూలు తెచ్చే సింహాచలం "కోడలు గారొచ్చినారని ఎరుకైంది. మల్లెపూలదండ ఉంచండి" అంటూ దాన్ని గడప మీద పెట్టి వెళ్ళాడు.

ఆ మరుక్షణం మా పక్క వాటాలో ఉంటున్న విశాలమ్మ "కామేశ్వరి వచ్చిందని తెలిసింది. పని తొందరలో రాలేకపోయాను. జడవేస్తాను లేవమ్మా కూతురా" అంటూ వదిన పక్కన చతికిలబడింది.

అన్నయ్య వేణు ఏమనుకున్నాడో కుర్చీలోంచి లేచి తన గదిలోకి వెళ్ళాడు. అమ్మ నా వైపు చూసింది. నేను నవ్వాను. అమ్మ వదినను చూసి "వెళ్ళి వాడికేం కావాలో చూడమ్మా" అంది. వదిన లేచి నెమ్మదిగా తమ పడగ్గదిలోకి వెళ్ళింది. నేను కుర్చీలోంచి లేచి ఆ గదికి బయట గడియ వేశాను.

అమ్మా, చలపతిగారూ నా వైపు చూస్తున్నారు. నేను మాత్రం నా మాటలు వాళ్ళకు వినబడాలని గదిలోపలికి మొహం పెట్టి అన్నాను "లోపల, లో లోపల మీరేం చేయదల్చు కున్నారో త్వరగా తేల్చుకోండి. మీరు రావాలనుకున్నా బయటకు రాలేరు. బయట గడియకు తాళం కూడా పెట్టదల్చుకున్నాను. ఆ తాళం తెల్లవారిన తర్వాత తీయబడుతుంది. కానీ... మీరు తెల్లవార్లూ ఆలోచించుకుని ఓ మంచి నిర్ణయానికి వస్తారనీ, కాదు కాదు, ఓ గొప్ప నిర్ణయానికీ వస్తారనీ, అందుకోసం మీకు కావల్సిన శక్తి - మదర్, శ్రీ అరబిందోలు ఇస్తారనీ నమ్ముతున్నాను."

నేను వెనక్కి తిరిగాను. అయితే లోపలి నుంచి అన్నయ్య "థ్యాంక్యూ ఫర్ వాట్ యు ఆర్" అని అనడం నాకు వినిపించింది.

అన్నయ్య గొంతులో ఆనందపు అంశ ఉంది.

ఆవేశం పాలు లేదు.

ఉక్రోషం పాలూ లేదు.

అందుకే వారి కథ మంచి మలుపే తీసుకుంటుందన్పించింది.

❖